మద్యం మత్తు.. ప్రాణాలకు చేటు

జనావాసాల్లో బెల్టు షాపులు

- ఉదయం 3 గంటల నుంచి మద్యం విక్రయం
- పనిచేసే చోట ప్రమాదాలకు గురౌతున్న కార్మికులు



ఉప్పల్ సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో జనావాసాల మధ్య విచ్చల విడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. రోజంతా పనిచేసి సంపాదించిన కూలీ డబ్బులు మద్యం తాగేందుకు కార్మికులు ఖర్చు పెడుతున్నారు. వచ్చిన డబ్బులు తాగుడుకే పెట్టడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

రాత్రి, పగలూ తేడా లేకుండా..

రామంతాపూర్: కొంతమంది రాత్రి, పగలూ తేడా లేకుండా మద్యం తాగుతూ కూలీ పనులకు కూడా వెళ్లడం లేదు. బెల్ట్ షాపులో ఎక్కువ శాతం తక్కువ ధర కలిగిన లిక్కర్‌ను విక్రయిస్తారు. దీన్ని తాగిన చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. లైసెన్స్ కలిగిన మద్యం షాపులో అమ్మకం ధరల కంటే దాదాపు రూ.40 నుంచి రూ.50 ఎక్కువ ధర వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి, మరుసటి రోజు నుంచే విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.


జాతీయ సెలవు దినాల్లోనూ విక్రయాలు..

జాతీయ సెలవు దినాలైన గాంధీ జయంతి, ఇండిపెండెన్స్ డే, రిపబ్లిక్ డే, బోనాల పండుగతో పాటు సాధారణ ఎన్నికలు, స్థానిక ఎన్నికలు నిర్వహించేటప్పుడు ప్రభుత్వం రెండ్రోజులు లైసెన్స్ ఉన్న వైన్‌షాపుల మూసివేతకు ఆదేశాలు ఇస్తారు. ఇలాంటి రోజుల్లోనే బెల్టు షాపులు 24 గంటలు తెరిచి ఉంచి మద్యం అమ్మకాలు ఏరులై పారుతాయి.

ఎక్కడెక్కడ..?

రామంతాపూర్ పరిధిలోని లక్ష్మీనారాయణనగర్, ఉప్పల్ ఐడీఏ శ్రీనగర్ కాలనీ, బైపాస్ రోడ్డు, నెహ్రూనగర్, ఇందిరానగర్, దేవేందర్‌నగర్, కేసీఆర్‌నగర్, రాంరెడ్డినగర్, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

రోడ్డున పడుతున్న పేద కుటుంబాలు..



ప్రభుత్వ లైసెన్స్ గల వైన్‌షాపులు, బార్లు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 11.30కు మూసి వేస్తారు. ఆ సమయంలోనే ఉదయం వైన్‌షాపులు తెరవని సమయాల్లో వేకువజామున ఉదయం 3 గంటల నుంచి 11 గంటల వరకు ఈ బెల్టు షాపుల్లో మద్యం సేవించి చాలా మంది భవన నిర్మాణ కార్మికులు అంబర్‌పేట్, గోల్నాక, చెంగిచర్లలో కబేళాలో పనిచేసే కార్మికులు స్థానిక పారిశ్రామికవాడల్లో ఉదయం షిఫ్టుకు వెళ్లే తాత్కాలిక కార్మికులు ఉదయం పూట మద్యం తాగి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు..

ఈ బెల్టు షాపులపై ఫిర్యాదు చేసిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం మద్యం అమ్మకాల టార్గెట్ పూర్తి కావాలంటే బెల్టు షాపులు ఉండాల్సిందే అన్నట్లుగా వాటి జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బెల్టు షాపులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా మద్యం విక్రయించే దుకాణాలు మూసేయాలి..



రామంతాపూర్ ఉప్పల్ పరిధిలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం షాపులను ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే మూసివేయాలి. 24 గంటలు ఈ బెల్టు షాపులు అందుబాటులో ఉండటంతో కొంతమంది తరుచూ మద్యం సేవిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు విధులకు హాజరై ప్రమాదాలపాలవుతున్నారు. అక్రమంగా విక్రయించే ఈ దుకాణాలను అధికారులు మూసివేయించకపోతే ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతాం.

– స్పజన,
మేడ్చల్ జిల్లా ఐద్వా అధ్యక్షురాలు

మంచినీటి సమస్యను పరిష్కరించండి



కాచిగూడ: మోతీమార్కెట్ సునార్‌లేన్‌లో ప్రజలు కొంతకాలంగా మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఏమాత్రం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ ఉమారాణి జలమండలి అధికారులతో కలిసి మోతీమార్కెట్, సునార్‌లేన్, ఆంజనేయస్వామి టెంపుల్ లేన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి మంచినీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటిసమస్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున సమస్యను సత్వరమే పరిష్కరించి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

సీపీఐపై రాష్ట్రీయ వానరసేన ఫిర్యాదు

కాచిగూడ: సీపీఐ తెలంగాణ నాయకత్వం ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను వక్రీకరించడం అనైతికమని రాష్ట్రీయ వానరసేన జాతీయ అధ్యక్షుడు నామ్ రాంరెడ్డి అన్నారు. శివాజీపై సీపీఐ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం ఆయన నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌పై తప్పుడు, తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసినందుకు సీపీఐ తెలంగాణ నాయకత్వంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణగూడ అడ్మిన్ ఎస్సై నాగరాజు మాట్లాడుతూ.. ఈ విషయంలో సంబంధిత అధికారులతో చర్చించిన తర్వాత పూర్తి దర్యాప్తు చేపడతామన్నారు. ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసే విషయాన్ని పరిశీలిస్తామని తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నేపథ్యంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. బర్కత్‌పుర బస్‌డిపో ఫీడర్ పరిధిలోని అమృత వర్షిణి అపార్ట్‌మెంట్, రాజేంద్రనగర్‌కాలనీ, కాచిగూడ రిజర్వేషన్ సెంటర్ తదితర ప్రాంతాలలో 10.30గంటల నుంచి 1.30 వరకు.. కాచిగూడ రైల్వే ఫీడర్ పరిధిలోని ఫీవర్ ఆస్పత్రి, కాచిగూడ రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభం

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీశంకర దేవాలయంలో మంగళవారం నుంచి మహా శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి బి.జ్యోతి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున 5గంటల నుంచి గణపతి పూజ, అఖండ దీపారాధాన, అభిషేకాలు, బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 26వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, రాత్రి కల్యాణ మహోత్సవం, అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 27వ తేదీన ఉదయం 5గంటల నుంచి రాత్రి 7గంటల వరకు స్వామివారికి పంచ్లరసాల అభిషేకం,చండీహోమం, తైలాభిషేకం, అన్నాభిషేకం, రాత్రి స్వామివారికి వసంతోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జ్యోతి కోరారు.

విద్యార్థులకు అభినందనలు

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డోనాల్డ్ కంపెనీ ప్రతినిధులు సోమవారం ఆన్ ద జాబ్ ట్రెనింగ్ ఇంటర్వ్యూ నిర్వహించారు. బీబీఏ రిటైల్ ఆపరేషన్ కోర్సు చదువుతున్న 13 మంది ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు మూడేళ్ల కళాశాల విద్యతో పాటు ఇంటర్న్‌షిప్ ఉంటుందని ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీబీఏ విభాగాధిపతి విరాల సంతోషితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ సూర్యప్రకాశ్‌రావుకు హెల్త్‌కేర్ లీడర్స్ గ్లోబల్ అవార్డు



అంబర్‌పేట: సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.సూర్యప్రకాశ్‌రావు టాప్‌మోస్ట్ హెల్త్‌కేర్ లీడర్స్ గ్లోబల్ అవార్డు అందుకున్నారు. వరల్డ్ హెల్త్ వెల్‌నెస్ కాంగ్రెస్ అండ్ అవార్డ్స్–2025 9వ ఎడిషన్ వారు ఇటీవల ప్రకటించిన అవార్డును అందుకున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్దాకాలంగా వేలాది మందికి గుండెకు సంబంధించిన ఆపరేషన్‌లను విజయవంతం చేసినందుకు తనను ఈ అవార్డు వరించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి గుండెకు సంబంధించిన వ్యాధులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నానని పేర్కొన్నారు. గుండె వ్యాధులు రాకుండా ఉండాలంటే క్రమశిక్షణతో కూడిన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు.

ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీగా రామానుజులరెడ్డి



ముషీరాబాద్: ముషీరాబాద్ సర్కిల్‌కు ఎట్టకేలకు పూర్తిస్థాయి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ను నియమిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి డీఎంసీగా మారుతీదివాకర్ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం రామానుజులరెడ్డి డీఎంసీగా బాధ్యలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన ముందుగా కమిషనర్, జోనల్ కమిషనర్లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్కిల్ సిబ్బంది కొత్త డీఎంసీని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంసీ రామానుజులరెడ్డి మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఇంట్లో గ్యాస్ లీక్.. తప్పని ప్రమాదం

కాచిగూడ: వంట గ్యాస్ లీకేజీతో కాచిగూడ, వీరన్నగుట్ట బస్తీలోని ఓ ఇంట్లో మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ... వీరన్నగుట్ట ప్రాంతానికి చెందిన తిలక్‌ప్రసాద్, లక్ష్మి దంపతులు ఆ ఇంట్లో నివాసం ఉంటున్నారు. వృత్తిరీత్యా వారు కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఫాస్ట్‌ఫుడ్ నడిపిస్తూ ఉంటారు. సోమవారం ఉదయం దంపతులిద్దరూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వచ్చారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో భార్య లక్ష్మి ఇంటికి వెళ్లి డోరు తెరవగానే మంటలతో పొగలు బయటకు వచ్చాయి. ఇంట్లోని కొన్ని వస్తువులు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు. ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అనంతరం గ్యాస్ లీక్ కాకుండా చర్యలు తీసుకున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి కమిషన్ తరుపున నివేదిక అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ... అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా విద్యా హక్కు చట్టాన్ని కల్పించకపోతే దళితులు చదువుకు దూరం అయ్యేవారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బహుజనులంతా ఉన్నత విద్యను అభ్యసించి ఆత్మగౌరవాన్ని పెంపొందించాలని తెలిపారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మనువాద భావాజాలం వల్లనే విద్యకు బడ్జెట్ కేటాయించకుండా బలహీనవర్గాలను విద్యకు దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల పాఠశాలలను మూసివేతకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు.

15శాతం ఇస్తామని 7శాతం నిధులు కేటాయించడమేంటి?

ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 15శాతం బడ్జెట్ విద్యకు కేటాయించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో విద్యకు 7శాతం నిధులు కేటాయించి తాము ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. రానున్న బడ్జెట్‌లోనైనా విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నాగరాజు, అనిల్, హరీష్, హైకోర్టు న్యాయవాది సాదిక్, దివాకర్, మెట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బస్ చార్జీలను పెంచడం సరికాదు



ఆర్టీసీ ఈడీ(ఓ)కు వినతి పత్రం అందజేస్తున్న హిందూ జన జాగృతి సమితి ప్రతినిధులు

కాచిగూడ: హిందూ పండుగల సందర్భంగా బస్ చార్జీల పెంపు రద్దు చేయాలని హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో ప్రతినిధులు రఘువీర్‌సింగ్ ఠాకూర్, నవీన్‌కుమార్, సుధాకర్ సోమవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిసంవత్సరం మహా శివరాత్రి పండుగ సందర్భంగా వివిధ శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల నుంచి ఆర్టీసీ బస్ చార్జీలను 50శాతం పెంచడం సరికాదన్నారు. ఇతర మతాలకు సంబంధించిన యాత్రికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయని అన్నారు. హజ్ యాత్రకు అలాగే జేరుషలేం యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించడం తెలిసిందే. అదే విధంగా హిందూ భక్తులకు కూడా ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

ఏఎల్ఎన్ రావు న్యాయవాదులకు ఆదర్శం



ప్రముఖ న్యాయవాది ఏఎల్ఎన్.రావు స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభత్సవంలో న్యాయవాదులు

అంబర్‌పేట: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో సోమవారం సీనియర్ న్యాయవాది ఏఎల్ఎన్ రావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం అంబర్‌పేట మున్సిపాల్‌లో గ్రౌండ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు నంది కొండ నర్సింగ్‌రావు, జేసీజే కీర్తిసింహ, బి.నగేష్‌లు హాజరై న్యాయవాది ఏఎల్ఎన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు, మానసిక వికాసంతో పాటు స్నేహపూరిత వాతావరణానికి దోహదపడతాయని అన్నారు. న్యాయవాద వృత్తిని విలువలు పాటిస్తూ అంకితభావంతో నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాది ఏఎల్ఎన్‌రావు న్యాయవాద వృత్తికి వన్నె తెచ్చారని కొనియాడారు. ఏఎల్ఎన్ రావు న్యాయవాదులకు ఆదర్శనీయమని అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శి ఏవీ కృష్ణరావు సౌజన్యంతో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు బార్ కౌన్సిల్ వైస్‌చైర్మన్ సునీల్‌గౌడ్, సభ్యులు దూస్స జనార్దన్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో వికలాంగులను నామినేట్ చేయాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేస్తూ ప్రత్యేక చట్టం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్యా డిమాండ్ చేశారు. ఇందుకోసం మార్చి 1 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సంతకాల సేకరణ చేయనున్నట్లు తెలిపారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అడివయ్యా మాట్లాడుతూ... 2025–26 రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల పెన్షన్ పెంపుకోసం నిధులు కేటాయించాలని కోరారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు కె. వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్, ఉపాధ్యక్షులు సాయమ్మ, జయరాజు, యశోదా తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా సౌకర్యాల కల్పన

కవాడిగూడ: ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్ ఉన్నికోటలో కమ్యూనిటీహాల్ శ్లాబ్ నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోటి పది లక్షల రూపాయలతో పనులు చేపడుతున్నామని అన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠాజైసింహ, శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్‌గౌడ్, డాక్టర్ శ్రీహరి, వి.రవియాదవ్, రాజుయాదవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలి



చిక్కడపల్లి: అపరిష్కృతంగా ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని వీవీగిరినగర్ , దోభీఘాట్, మాలబస్తీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నేత వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

కాచిగూడ: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో 16 లక్షల మంది పట్టభద్రులు ఉన్నారని తెలిపారు. వారికి ఉద్యోగాలు రాక తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని అన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. నిరుద్యోగ భృతి ఇచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టాలన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి



కాచిగూడ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాకేష్ నేతృత్వంలో సోమవారం విద్యార్థులు నారాయణగూడలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నారాయణగూడలోని కార్పొరేట్ కళాశాల ఎదుట ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజు వసూళ్లను నియంత్రించాలన్నారు. పేరెంట్స్ అనుమతి లేకుండా ఫీజులు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల కొమ్ముకాస్తోందని ఆరోపించారు. విద్యార్థుల ప్రాణాలుపోతున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు హరీష్, దీక్షిత, నవీన్, అనిల్, శివభార్గవి, హరిణి, భీమా, లోకేష్, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి డివిజన్‌కు పూర్థిసాయి కమిటీ నియమించాలి

మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్



పూజలు నిర్వహిస్తున్న మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: ప్రతి డివిజన్‌కు పూర్తిస్థాయి కమిటీని నియమించాలని మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఆధ్వర్యంలో బాపూజీనగర్‌లో భరత్‌గౌడ్, కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానికులతో కలిసి 'టిఫిన్ పే చర్చా'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మహంకాళి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో బీజేపీ డివిజన్ కార్పొరేటర్లు ఘన విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా వారిని కంచి కుమార్‌ముదిరాజ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమాల్‌పురి నందు, సత్యనారాయణ, అనిల్‌కుమార్, కుషాల్‌గౌడ్, బద్రి నారాయణ, అజయ్‌గుప్తా, నర్సింగ్‌రావు, లక్ష్మణ్, బిజ్జి రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



బర్కత్‌పురలోని సంఘం కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండ దేవయ్య పటేల్

కాచిగూడ: మున్నూరుకాపులు అందరూ ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. ఆ దిశగా మున్నూరుకాపులు పార్టీలు, సంఘాలకు అతీతంగా అందరూ ఐక్యతను చాటుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సోమవారం బర్కత్‌పురలోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.5వేల కోట్లతో మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ కులగణనలో మున్నూరుకాపుల జనాభాను తక్కువ చేసి చూపెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.

◆ మున్నూరుకాపుల సంఘటిత శక్తిని చాటేందుకు మార్చి చివరి వారంలో నగరంలో మున్నూరుకాపుల ఆత్మగౌరవ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం మున్నూరుకాపు ఐక్యవేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మున్నూరుకాపులు అభివృద్ధి సాధించాలంటే రాజ్యాధికార సాధనే ఎకైక మార్గమని అన్నారు. అందుకోసం మున్నూరుకాపుల సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లా హరిశంకర్, కొత్త లక్ష్మణ్ పటేల్, సత్తినేని శ్రీనివాస్, కోట్ల మహేష్, వెంగళ రమేష్, మరాటి సత్తన్న, శెట్టిపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సాంస్కృతిక కేంద్రం కృషి అభినందనీయం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రజా సాంస్కృతిక కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వివిధ రంగాలలో సేవలు అందిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్న తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అభినందనీయమని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. బహుముఖ కార్యకలాపాలకు కేంద్రంగా పనిచేయాలని సూచించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ... రాజకీయ, ఆర్థిక ఉద్యమాలతోనే సరిపోదని సామాజిక సాంస్కృతిక మేధావులను కూడా ప్రభావితం చేస్తూ బహుముఖ కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు.

◆ టీజీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మార్చి 6న 'ఆధ్యాత్మిక రంగం కృషి

◆ భజన కోలాటం కళాకారులు'అనే అంశంపై రాష్ట్ర వర్క్‌షాపును హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. సాంస్కృతిక రంగంలో పనిచేసే కళాకారులందరూ జిల్లాకు ముగ్గురు చొప్పున హాజరుకావాలని సూచించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'షీరోస్'అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని వారంరోజుల పాటు దళిత బహుజన కార్మిక వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే ప్రతినిధులు జి.రాములు, హిమబిందు, యాదగిరిరావు, పి.రమేష్, జి.నరేష్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.